
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 20.953 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 20.953 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు, ఉత్తర, దక్షిణ, కావలి కాలువలకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,620
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,713
3 శాతం జీఎస్టీతో..	రూ.5,884
నవర (8 గ్రా)	రూ.47,072

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.2 /23.2

శుక్రవారం గాలిలో తేమ 56 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. శనివారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

'ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా'కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సంస్థ హెచ్ఎస్ఈ హెడ్ పవన్‌రావు

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న 'ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా' సంస్థకు ప్రతిష్టాత్మకమైన 'ప్లాటినమ్ బెంచ్ మార్కింగ్' అవార్డు లభించింది. ముంబైలో జరిగిన 8వ జాతీయ సదస్సులో ఫోరమ్ ఆఫ్ బిహేవియరల్ సేఫ్టీ ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రదానం చేశారని సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్స్ విభాగంలో వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యంలో శ్రేష్ఠత ప్రధాన అంశాలుగా స్వీకరించి సంస్థను ఈ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. ఇలాంటి అరుదైన గౌరవాన్ని పొందడం ఇది ఐదోసారి అని ఆయన తెలిపారు. ఈ అవార్డును సాధించినందుకు హెల్త్, సేఫ్టీ, ఎన్విరాన్‌మెంట్ విభాగాన్ని అభినందించారు.

జెడ్పీటీసీ సభ్యురాలి సస్పెన్షన్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచిన సూరా ప్రదీపని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ అందె పెంచల ప్రత్యూషని కూడా వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున ఆమెను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

అందుబాటులో అన్ని వైద్యసేవలు

- డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్



గుండెపోటుకు ఉపయోగించే ఇంజెక్షన్‌ను చూపుతున్న డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్

పొదలకూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ సూచించారు. పొదలకూరు సీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్యసేవల వివరాలను అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకుంటే ప్రభుత్వం నుంచి నిధులు అందుతాయని, గర్భకోశ, దంత, చిన్నపిల్లల, కంటి వైద్యసేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే, స్కానింగ్, అన్నిరకాల రక్త పరీక్షలు, ఈసీజీ ఉన్నట్లు తెలిపారు. అలాగే గుండెపోటు వస్తే వెంటనే బతికించేందుకు సీహెచ్‌సీలో రూ.80 వేల ఖరీదైన రెండు ఇంజెక్షన్లను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆయన వెంట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో పలుచోట్ల డ్రోన్ పైలట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటికే డ్రోన్ పైలట్లుగా 29 మందికి శిక్షణ ఇచ్చామని, ప్రస్తుతం వెంకటాచలం, ఉదయగిరి, రాపూరు, లింగసముద్రం, గుడ్లూరు మండలాలకు సంబంధించి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. వివరాలకు మండల వ్యవసాయశాఖ అధికారులను గానీ, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో గానీ సంప్రదించవచ్చని తెలిపారు. ఇంటర్/వ్యవసాయ డిప్లమో/వ్యవసాయ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణులై 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థి పేరు మీద కానీ, కుటుంబసభ్యుల మీద కానీ పొలం ఉండాలని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కంటైనర్ టెర్మినల్ ఇక్కడే

సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నికల వేళ టీడీపీ నేత సోమిరెడ్డి చేస్తున్న విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. వరుస ఓటములు ఎదుర్కొన్న ఆయన మరోసారి కూడా గెలిచే పరిస్థితి కనబడడం లేదని సర్వేలు చెబుతుండడంతో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కాకాణిపై బురదజల్లేందుకు నిత్యం ప్రయత్నిస్తూ నవ్వులపాలవుతున్నారు. ఇటీవల కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ సేవలు నిలిచిపోతున్నాయని, వేలాది మంది ఉపాధి కోల్పోతారంటూ ప్రచారం చేసి అభాసు పాలయ్యారు.

కృష్ణపట్నం పోర్టుకు చేరుకున్న కంటైనర్ వెసల్

- 2,800 కంటైనర్ల దిగుమతి
- యథాతథంగా కొనసాగుతున్న సేవలు
- టీడీపీ నేత సోమిరెడ్డి సీటు కోసం ఫీట్లు
- మంత్రి కాకాణిపై నిత్యం బురదజల్లే ప్రయత్నం చేస్తున్న వైనం
- సోమిరెడ్డి తీరుపై విస్తుపోతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నప్పుడు వారిని నిలదీయడం ప్రతిపక్ష పార్టీల నేతల కర్తవ్యం. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు స్వాగతించడం, ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటాలు చేయడం ప్రతిపక్ష పార్టీల నేతల బాధ్యత. అయితే జిల్లాలోని సర్వేపల్లి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని చూసి ఓర్వలేని టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిత్రవిచిత్ర రాజకీయ విన్యాసాలు చేస్తూ అభాసుపాలవుతున్నారు. తాజాగా కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ సేవలు నిలిచిపోయాయంటూ సోమిరెడ్డి తెగ హడావుడి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి వల్లే కంటైనర్ టెర్మినల్ సేవలు నిలిచిపోనున్నాయని.. తద్వారా 20 వేల మందికి ఉపాధి కోల్పోనున్నారని, ఈ పరిణామంతో ముత్తుకూరు మండలంలో బూడిదే మిగులుతుందంటూ సోమిరెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి గగ్గోలు పెట్టాడు. ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశాడు. అఖిలపక్షం పేరుతో తన అనుచరులు కొందరిని కృష్ణపట్నం పోర్టుకు తీసుకెళ్లి నానా యాగీ చేశారు.

సీన్ కట్ చేస్తే..

కృష్ణపట్నం పోర్టులో ప్రస్తుతం జరుగుతున్న



కృష్ణపట్నం పోర్టులో లంగరు వేసిన నౌక నుంచి కంటైనర్లను దిగుమతి చేస్తున్న దృశ్యం

మొత్తం సరుకు రవాణా 57.8 మిలియన్ టన్నులు. అసలు దేశంలోనే మొత్తం మేజర్ పోర్టులన్నీ కలిపి గతేడాది చేసిన సరుకుల రవాణా 795 మిలియన్ టన్నులు. కానీ అందులో కృష్ణపట్నం పోర్టు ద్వారానే సరుకు రవాణా అధికంగా జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మూడేళ్ల క్రితం కృష్ణపట్నం పోర్టులో 3.81 కోట్ల టన్నులుగా ఉన్న వార్షిక సరుకు రవాణా ఇప్పుడు 5.78 కోట్ల టన్నులకు పెరిగింది. కాగా కరోనా సంక్షోభంతో ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు తగ్గి కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలను ఎన్నూర్, చెన్నై పోర్టుకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియగానే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంటనే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కేంద్ర మంత్రికి లేఖ రాశారు. పార్లమెంట్ సభ్యుల ద్వారా ఒత్తిడి పెంచడంతో పోర్టు యాజమాన్యం కంటైనర్ టెర్మినల్ సేవలు నిలిపివేయడం లేదని తేల్చి చెప్పింది. ఈ క్రమంలో శుక్రవారం 4 వేల కంటైనర్‌లతో కృష్ణపట్నం పోర్టుకు కంటైనర్ వెసల్ చేరుకుంది. వాటిలో 2,800 కంటైనర్‌లు కృష్ణపట్నంలో దిగుమతి అయ్యాయి.

సీటు కోసమే విన్యాసాలా..

జిల్లా టీడీపీలో సీనియర్ నేతగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చివరకు తన సీటు ఖరారు చేయించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అబద్ధాలతో అడ్డదారులు తొక్కుతూ చిత్ర విచిత్ర విన్యాసాలు చేస్తూ ప్రజల్లో చులకనయ్యారు. దీంతో సోమిరెడ్డి వెంట నడిచేందుకు నేతలు జంకుతున్నారు. దీంతో ఏదో చెయ్యాలనే ఆలోచనతో మంత్రి కాకాణిపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ అభాసుపాలవుతున్నారు. అంతేకాక తరచూ అద్దె బ్యాచ్‌లు, నాన్ లోకల్ వారిని పిలిపించుకుని టీడీపీ కండువాలు కప్పి నవ్వుల పాలయ్యారు.

సోమిరెడ్డికి సీటు ఇస్తారో.. ఇవ్వరో..!

సర్వేపల్లిలో తాజాగా టీడీపీ సీటు విషయంలో అధిష్టానం ఇతరులను పరిశీలించడం సోమిరెడ్డికి మింగుడుపడడం లేదు. ఉన్న నియోజకవర్గాన్ని పోగొట్టుకుంటే తన రాజకీయ భవిష్యత్‌కు ఇబ్బంది ఉంటుందని తెగ మదనపడిపోతున్నారు. తాజాగా సర్వేపల్లిలో ఆనం రామనారాయణరెడ్డికి టీడీపీ సీటు ఇస్తే ఎలా ఉంటుందని ఆ పార్టీ అధినేత స్వయంగా తన వాయిస్‌తోనే సర్వే చేయడం పుండు మీద కారం చల్లినట్లైంది. తనకు సీటు ఇస్తారో.. ఇవ్వరో.. తెలియని సోమిరెడ్డి అడ్డమైన పనులు చేస్తూ చులకన అవుతున్నాడని ప్రజలు ఏవగించుకుంటున్నారు.

కంటైనర్ల నౌక రాక.. దుష్ప్రచారానికి తెర

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ల నౌక లంగరు వేయడం ద్వారా ప్రత్యర్థులు కొంతకాలంగా చేస్తున్న దుష్ప్రచారానికి తెరపడిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. 4,000 కంటైనర్లతో పోర్టులో లంగరు వేసిన కొలంబోకి చెందిన 'ఎంఎస్‌సీ గినా' అనే నౌకను మంత్రి కాకాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీరో పాయింట్ వద్ద దీని వివరాలతోపాటు రాజకీయ ప్రత్యర్థుల ఆరోపణలకు విలేకరుల వద్ద దీటుగా బదులిచ్చారు. కంటైనర్ టెర్మినల్ తరలిపోతోందంటూ టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలు నౌక రావడం ద్వారా అవాస్తవమని రుజువైందన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక కంటైనర్ టెర్మినల్‌ను రాజకీయం చేసి ప్రభుత్వంపై బురద చల్లాలని భావించారని, కంటైనర్ టెర్మినల్ సేవలు మూతపడుతున్నాయంటూ అఖిలపక్షం పేరుతో సోమిరెడ్డి డ్రామాలు వేశారని గుర్తుచేశారు. కంటైనర్ టెర్మినల్ తరలిపోదని, పోర్టులో సేవలు కొనసాగుతాయని తాము స్పష్టం చేశామని తెలిపారు. కొంతకాలంగా జరుగుతున్న ఈ ఆరోపణలను పటాపంచలు చేస్తూ పోర్టుకు 4,000 కంటైనర్లతో కూడిన భారీ నౌక వచ్చిందన్నారు. ఇందులో 2,800 కంటైనర్లను కృష్ణపట్నం పోర్టులో దిగుమతి చేస్తున్నారని తెలిపారు.

నీతి మాలిన వ్యక్తి సోమిరెడ్డి

సోమిరెడ్డి నిజాయితీ, నిబద్ధత కొరవడిన నీతిమాలిన వ్యక్తి అని మంత్రి కాకాణి మండిపడ్డారు. అభివృద్ధి చెందే సంస్థలపై అభాండాలు వేయకూడదన్నారు. టెర్మినల్ తరలిపోతోందనగానే తన బాధ్యతగా వెంటనే కేంద్రం ప్రభుత్వంతోపాటు ఎంపీలు విజయసాయిరెడ్డి, గురుమూర్తి, మిథున్‌రెడ్డి, సీఎం కార్యాలయం, నౌకయాన శాఖ కార్యదర్శి యువరాజు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. చివరకు తన బాధ్యతగా కంటైనర్ల నౌకను పోర్టుకు రప్పించామన్నారు.

పోర్టు నిర్వాహకులకు ధన్యవాదాలు

అవాస్తవాలు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో భారీ కంటైనర్ల నౌకను రప్పించిన పోర్టు నిర్వాహకులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. లంగరు వేసిన నౌక, కంటైనర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, సీఓఓ రాజన్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



కంటైనర్ల నౌకను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంతర్జాతీయ యూనివర్సిటీల ఆన్‌లైన్ కోర్సులను ఎడెక్స్ సంస్థ ద్వారా అందించేందుకు ఒప్పందం చేసుకోవడం గర్వకారణమని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ ఎడెక్స్ ప్రతినిధులు సీఎం ఆధ్వర్యంలో ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి వర్చువల్‌గా నెల్లూరు కలెక్టరేట్ నుంచి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రామచంద్రారెడ్డి, సీడీసీ డీన్ సీహెచ్ విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మన విద్యార్థులు గ్లోబల్ సిటిజన్లుగా ఎదిగేందుకు ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలు గల విశ్వవిద్యాలయాల్లో లభించే కోర్సులను ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ ద్వారా ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టడాన్ని విద్యార్థులు అదృష్టంగా భావించాలన్నారు. దీంతో ప్రపంచస్థాయిలో భాషా పరిజ్ఞానం, నైపుణ్యం పెంపొంది మన విద్యార్థులు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతారని తెలిపారు.



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న వీఎస్‌యూ రిజిస్ట్రార్ తదితరులు

వైఎస్సార్‌సీపీ కమిటీలకు ఎంపిక

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా రైతు విభాగ కమిటీని శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా పూండ్ల అచ్యుతకుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా పలుకూరు ప్రసాద్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శిగా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన గురివిందపూడి మస్తాన్‌లను నియమించారు. రాష్ట్ర మైనారిటీ విభాగం అధికార ప్రతినిధిగా మహ్మద్ రఫూద్దీన్, జనరల్ సెక్రటరీగా ఎండీ మునీర్ సిద్ధిఖ్, సెక్రటరీలుగా షేక్ షాకాత్‌అలీ, సయ్యద్ అబ్దుల్‌అలీం, జాయింట్ సెక్రటరీగా షేక్ నాయబ్‌రసూల్, ఎస్టీ సెల్ జోన్ ఇన్‌చార్జిగా చేవూరి పద్మ, జాయింట్ సెక్రటరీలుగా పేరం వెంకటేశ్వర్లు, చలంచర్ల శ్రీనివాసరావు, గోళ్ల ఉదయ్‌భాస్కర్, వైఎస్సార్ సేవాదళ్ జనరల్ సెక్రటరీగా దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, సెక్రటరీగా రావు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా అక్కెపాటి వినోద్‌కుమార్‌రెడ్డి, కల్చరల్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా యనమల జాషువా, లీగల్ సెల్ సెక్రటరీగా కె.సురేంద్రరెడ్డి, జాయింట్ సెక్రటరీగా దరపాల రమేష్‌లను నియమించారు.

రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో తాడేపల్లి నుంచి వర్చువల్‌గా సమావేశమై చుక్కల భూములు, అసైన్‌మెంట్ భూముల పంపిణీ, రీసర్వే, జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు, ఉపాధి హామీ పనులు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.హరినారాయణన్ వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో అసైన్‌మెంట్ భూముల పంపిణీ, రీసర్వే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్‌ప్రసాద్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగవరప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్

బర్డ్‌ఫ్లూపై రెడ్ అలర్ట్

- జిల్లాలో వ్యాధి విజృంభణ
- పొదలకూరు, కోవూరు ప్రాంతాల్లో వేలాది కోళ్లు మృతి
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్
- వ్యాధి సోకిన ప్రదేశాల్లో కోళ్లషాపుల మూసివేత
- కోళ్ల రవాణాను నిలిపివేయాలని ఆదేశాలు

సాక్షి ప్రతినిధి,నెల్లూరు/నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో వ్యాప్తిచెందుతున్న 'బర్డ్‌ఫ్లూ' వ్యాధి పక్షుల నుంచి మనుషులకు కూడా సోకుతుందని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, కేరళ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ వ్యాధి సోకి లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడ్డాయి. ఈ వ్యాధి పట్ల అందరూ అలర్ట్‌గా ఉండాలని 2021లో కేంద్ర ప్రభుత్వం సూచించింది. తాజాగా జిల్లాలోని పొదలకూరు మండలం చాటగొట్ల, కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ గ్రామాల్లో నాటు, బ్రాయిలర్ కోళ్ల ఫాంలలో బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాపించి ఈ నెల 5న కోళ్లు వేల సంఖ్యలో చనిపోయాయి. కోళ్ల ఫాంల యజమానులు వెంటనే పశు వైద్యాధికారులను సంప్రదించారు. పశుసంవర్ధకశాఖ అధికారులు అక్కడికి వెళ్లి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం విజయవాడలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వీబీఆర్ఐ)కు పంపారు. అక్కడి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధికారులు ఈ రక్త నమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్‌కు పంపారు. వారు పరీక్షించి కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిందని నిర్ధారించి గురువారం ఆ రిపోర్టును విజయవాడకు పంపారు. విజయవాడ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధికారులు వెంటనే జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు ఈ సమాచారం అందించారు.

నేలపట్టులో రాలేదు

సాధారణంగా విదేశీ పక్షుల ద్వారా బర్డ్‌ఫ్లూ వస్తుందని అంటారు. అయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నేలపట్టు ప్రాంతానికి విదేశీ వలస పక్షులు ఫ్లెమింగోలు వస్తుంటాయి. నైజీరియా నుంచి వేల కిలో మీటర్లు ప్రయాణించి ఇక్కడికి వచ్చి గుడ్లు పెట్టి పిల్లలు పొదిగిన తర్వాత పిల్లలతో కలిసి వెళుతుంటాయి. వైల్డ్‌లైఫ్ అధికారులు ఆ పక్షుల సంరక్షణార్థం ప్రతి ఏటా ఫ్లెమింగో ఫెస్టివల్ కూడా నిర్వహిస్తారు. అయితే నేలపట్టు ప్రాంతంలోని పక్షులకు ఈ వ్యాధి సోకకపోయినప్పటికీ ఆ ప్రాంతాన్ని కూడా అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

అధికారుల అప్రమత్తం

బర్డ్‌ఫ్లూ వ్యాధి జిల్లాలో వ్యాప్తి చెందుతోందని నివేదికలు రావడంతో కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను అప్రమత్తం చేశారు. ముందుగా సరిహద్దు జిల్లాలైన ప్రకాశం, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాలను అలర్ట్ చేశారు. జిల్లాస్థాయిలో డీపీఓ, పశుసంవర్ధకశాఖలను అప్రమత్తం చేసి వారి ద్వారా ఆయా ప్రాంతాల్లో వ్యాధి నివారణ చర్యలు చేపట్టారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం



నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందకుండా కలెక్టర్ సూచనలతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రధానంగా బర్డ్‌ఫ్లూ వచ్చిన ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. బర్డ్‌ఫ్లూ వ్యాపించిన ప్రాంతానికి సమీపంలోని కోళ్లకు ఏమైనా వ్యాధి లక్షణాలు ఉన్నాయా అనే వివరాలు సేకరిస్తున్నాం.

– మహేశ్వరుడు, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి

వ్యాధి నివారణకు చర్యలు

- డీపీఓ సుస్మితారెడ్డి

పొదలకూరు : పక్షులు, కోళ్ల ద్వారా సక్రమించే బర్డ్‌ఫ్లూ వ్యాధిని నివారించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి తెలిపారు. పొదలకూరు మండలంలోని చాటగొట్ల కోళ్లఫాంలో బర్డ్‌ఫ్లూ వ్యాధితో మృతిచెందిన కోళ్లకు సంబంధించి వివరాలను సేకరించిన డీపీఓ పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చాటగొట్ల కోళ్లఫాంలో పంచాయతీ సిబ్బందికి పీపీ కిట్స్ అందజేసి శానిటేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి ఒక కి.మీ. పరిధిలో ఉన్న చికెన్ దుకాణాలను మూడు నెలల వరకు మూసివేయాలని, అలాగే 10 కి.మీ. పరిధిలో ఉన్న చికెన్ దుకాణాలు మూడు రోజులపాటు మూసివేయాలని ఆదేశించారు. పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చాటగొట్లకు 10 కి.మీ. పరిధిలో 14 పంచాయతీలు ఉన్నాయని, సైదాపురం మండలంలో మూడు పంచాయతీలు, నెల్లూరు రూరల్ మండలంలో నాలుగు పంచాయతీలు ఉన్నాయని, బయటి నుంచి ఇక్కడికి కోళ్లు తీసుకు రావడం, ఇక్కడి నుంచి కోళ్లను ఎగుమతి చేయడం ఆపివేయాలని ఆదేశించారు. డీపీఓ వెంట పశుసంవర్ధకశాఖ డీడీ నాగమణి, ఏడీఏ అరుణ, పశువైద్యాధికారులు మురళీకృష్ణారెడ్డి, శిరీష, రాధిక, సీఐ ఆర్.రాంబాబు తదితరులు ఉన్నారు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు సీఐ ఆర్.రాంబాబు తమ సిబ్బంది ద్వారా పొదలకూరు పట్టణంలో చికెన్ దుకాణాలను మూయించారు. చికెన్ దుకాణాలు తెరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



చాటగొట్లలో అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

చికెన్ విక్రయాలపై నిషేధం



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు

కోవూరు: పట్టణ పరిధిలోని గుమ్మళ్లదిబ్బలో బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందిన నేపథ్యంలో శుక్రవారం కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు తెలిపారు. కోవూరులోని సచివాలయం–4లో శుక్రవారం ఆయన వైద్యారోగ్య, పశుసంవర్ధక, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మళ్లదిబ్బలో మూడు నెలలపాటు చికెన్ విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు చికెన్ తినరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించి చికెన్ విక్రయాలు జరిపినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుమ్మళ్లదిబ్బ నుంచి 10 కి.మీ. పరిధిలో 3 రోజులపాటు చికెన్ దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి మహేశ్వరుడు, ట్రైయినీ డీఎస్పీ హేమలత, సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్, ఎంపీడీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కె.రవికుమార్ నెల్లూరు నగరంలోని మూలాపేట వాసి. ఈయన వాహనమిత్ర ద్వారా లబ్ధి పొందారు. తమ కుటుంబానికి చెందిన వజ్రమ్మ వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా నాలుగేళ్లలో రూ.8,58,819 లబ్ధి పొందినట్లు తెలిపారు.

వెంకటాచలానికి చెందిన ఖాదర్‌బీ ఆరోగ్యం బాగోలేకపోవడంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకున్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాల్లో ఆమె ప్రభుత్వం ద్వారా రూ.16,28,882 లబ్ధి పొందారు.

సంక్షేమ విప్లవం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అండగా నిలిచింది. ఏదో ఒక సంక్షేమ పథకం అందుకుని లబ్ధిపొందిన వారు ఎందరో ఉన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రజాప్రతినిధులు ఊర్లల్లో తిరుగుతున్న సమయంలో తమకు జగన్ ఎంతో మంచి చేశారని సంతోషంగా చెప్పిన లబ్ధిదారులున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఏనాడూ ఈ పరిస్థితి లేదు. అరకొర పథకాలతో కాలం వెళ్లదీశారు.


మనుబోలు: వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

పేదల కోసం పథకాలు ప్రవేశపెట్టిన సీఎం జగన్

- ఉమ్మడి జిల్లాలో లక్షల్లో లబ్ధిదారులు
- వారికి అందజేసిన సొమ్ము రూ.14,252 కోట్లు
- రూ.లక్షలు అందుకున్న కుటుంబాలు ఎన్నో..



నెల్లూరు(పొగతోట): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనలో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలు జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. పాదయాత్ర సమయంలో ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వివిధ పథకాలు ప్రవేశపెట్టారు. వాటిలో వైఎస్సార్ పెన్షన్ కానుక, అందరికీ ఇళ్లు, రైతు భరోసా, ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, నేతన్న నేస్తం, వాహనమిత్ర తదితరాలున్నాయి. పొదుపు మహిళలకు సున్నా వడ్డీ, ఆసరా, బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి రుణాలు అందిస్తూ వారికి అండగా నిలిచారు. రోడ్డు సైడ్ వ్యాపారులకు ప్రతి సంవత్సరం నగదు అందజేస్తూ ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం బాటలు వేసింది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సులువుగా పథకాలు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో పింఛన్ల విషయంలో ఎదురైన సమస్యలు ఎన్నో.. కొత్త పింఛన్ మంజూరు కావాలంటే లబ్ధిదారుల్లో ఎవరో ఒకరు చనిపోవాలి. ఇంకా జన్మభూమి కమిటీ సిఫార్సు చేయాలి. అదే ఇప్పుడు అర్హత ఉంటే చాలు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే పని లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలో లబ్ధిదారులకు ఇచ్చిన నగదు రూ.14,252 కోట్లని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

ఈ సమయంలోనూ..

కోవిడ్ సమయంలో అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ మూతపడ్డాయి. రైతులు, కార్మికులు, చిరుద్యోగులు పనుల్లేక నానా ఇబ్బందులు పడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల వల్ల లావాదేవీలు పెరిగి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జీవనం సాగించారు.

రూ.లక్షల్లో లబ్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందింది. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షల పైన లబ్ధిపొందిన కుటుంబాలు రెండు ఉన్నాయి. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి పొందిన కుటుంబాలు 499 ఉన్నాయి. అదే రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు అందుకున్న కుటుంబాలు 24,976 ఉన్నాయి. ఇక రూ.10 వేలపైన లబ్ధిపొందిన కుటుంబాలు 41,759 ఉన్నాయి. మొత్తంగా రూ.లక్షలు అందుకున్న వారు చాలామంది ఉన్నారు.


నెల్లూరు: ఒకటో డివిజన్‌లోని మరియమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ రేవతి (ఫైల్)

సీఎంకు ధన్యవాదాలు



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చారు. అమ్మఒడి, రైతుభరోసా తదితర పథకాల ద్వారా నేను మొత్తం రూ.12,24,640 లబ్ధిపొందాను. పేద ప్రజల సంక్షేమ కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎంకు ధన్యవాదాలు.

– అశోక్, పెద్దపాడు, కలిగిరి మండలం

నిరంతరం శ్రమిస్తున్నారు



రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ముందుగా ప్రకటించిన విధంగా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పథకాలు అందిస్తోంది. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. సంక్షేమ ఫలాలను ప్రతి కుటుంబానికి చేర్చేందుకు అధికారులు, ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తున్నారు.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

పోలింగ్ కేంద్రాలపై ఓటర్లకు అవగాహన

- నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి


మాట్లాడుతున్న బాపిరెడ్డి, పక్కన డీఆర్‌డీఏ పీడీ

నెల్లూరు(పొగతోట): 'పోలింగ్ కేంద్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలి. ఎక్కడ ఏర్పాటు చేశారు. ఏ సౌకర్యాలు కల్పించారో వివరించాలి' అని నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి ఆదేశించారు. నెల్లూరు డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం స్వీప్ కార్యక్రమంపై నోడల్ ఆఫీసర్స్, జిల్లా కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డెమో ఈవీఎంల ద్వారా ప్రజలందరికీ అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ప్రాంతాల్లో ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మాట్లాడుతూ డీఆర్‌డీఏ, డ్వామా, డీపీఓ, ఐసీడీఎస్, డీఎంహెచ్‌ఓ తదితర శాఖలు ఈనెల 19వ తేదీలోపు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంకా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్త సేకరణ వాహనాలు, రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ఓటు నమోదు, వినియోగంపై ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి మండలంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వృద్ధుడి హత్య


నారాయణరెడ్డి మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని సాల్మాన్‌పురం గ్రామంలో శుక్రవారం ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తిని నారాయణరెడ్డి (75)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

క్లుప్తంగా

డబ్బు తిరిగివ్వాలంటూ ధర్నా


ధర్నా చేస్తున్న రమణయ్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పంచేడు గ్రామానికి చెందిన వవ్వేరు కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి తన దగ్గర తీసుకున్న రూ.36 లక్షలు తిరిగివ్వాలని నెల్లూరుకు చెందిన రమణయ్య అనే వృద్ధుడు ధర్నా చేశారు. శుక్రవారం ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ సూరా తన కూతురి ఉన్నత చదువు నిమిత్తం రూ.36 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జూదానికి బానిసై.. అప్పులపాలై..

- బంగారు నగల కోసమే ఘాతుకం
- వృద్ధురాళ్లను హత్య చేసి ఆపై దహనం
- సాంకేతికత ఆధారంగా నిందితుడి అరెస్ట్
- జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చేందుకు ఇద్దరు వృద్ధురాళ్లను హత్య చేశాడు. వారి బంగారు ఆభరణాలను దోచుకుని మృతదేహాలను తగులబెట్టి పరారయ్యాడు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి వివరాలను వెల్లడించారు. వెంకటాచలం మండలం కందలపాడు గ్రామానికి చెందిన కప్పిరి గిరీష్ ఇంటర్ వరకు చదివాడు. ఆటో నడుపుతుంటాడు. ఈ క్రమంలోనే అతను ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌కు బానిసై రూ.లక్షల్లో అప్పులు చేశాడు. నగదు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీంతో తన చెల్లెలు బంగారు ఆభరణాలను కుదువపెట్టి కొంత మేర అప్పులు తీర్చాడు. గిరీష్ అన్న రవీంద్ర అలియాస్ రవి వెంకటాచలం మండలం చెముడుగుంటలో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఆయన ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గిరీష్ తన అన్న దుకాణంలో చేరాడు. కొద్దిరోజులుగా అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. మరోవైపు కుదువపెట్టిన బంగారు ఆభరణాలు విడిపించుకోవాలని లేనిపక్షంలో వేలం వేస్తానని వ్యాపారి తేల్చిచెప్పాడు. దీంతో ఎలాగైనా నగదు సంపాదించి అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్నాడు.


పథకం ప్రకారం

చెముడుగుంట పవన్ కాలనీకి చెందిన మేకల జయలక్ష్మి అలియాస్ జయమ్మ (67), గంగవరపు రాజేశ్వరి అలియాస్ రాజేశ్వరమ్మ (70) కూరగాయల కోసం రవీంద్ర దుకాణానికి వచ్చేవారు. వారి ఒంటిపై బంగారు ఆభరణాలను గమనించిన గిరీష్ ఎలాగైనా దొంగతనం చేసి అప్పులు తీర్చాలని అనుకున్నాడు. కుదరని పక్షంలో హత్య చేసైనా దోచుకోవాలని నిర్ణయించుకుని సమయం కోసం వేచిచూడసాగాడు. ఈనెల 12వ తేదీ సాయంత్రం జయమ్మ, రాజేశ్వరమ్మ కూరగాయల కోసం రవీంద్ర దుకాణానికి వచ్చారు. వారితో మాటలు కలిపిన గిరీష్ వెనుక గదిలో తాజా కూరగాయలున్నాయని.. వెళ్లి తెచ్చుకోమని చెప్పాడు. తొలుత జయమ్మ వెళ్లగా ఆమెను వెంబడించిన నిందితుడు రోకలిబండతో తలపై కొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. కొద్దిసేపటికి రాజేశ్వరమ్మ రాగా రోకలి బండతో ఆమె తలపై కొట్టి గొంతు కోసి హత్య చేశాడు. వృద్ధురాళ్ల ఒంటిపైనున్న బంగారు ఆభరణాలను దోచుకున్నాడు. కొన్ని నగలు నకిలీవని తేలడంతో వాటిని వదిలివేశాడు.

మృతదేహాలను తగులబెట్టి..


మృతదేహాలు దొరక్కుండా చేయాలని గిరీష్ నిర్ణయించుకున్నాడు. దుకాణానికి సమీపంలోని పెట్రోల్ బంకులో డీజిల్ కొనుగోలు చేశాడు. అనంతరం మృతదేహాలను మూటగట్టి ఆటోలో అంబాపురం గ్రామ శివార్లలోని జామాయిల్ తోటల్లోకి తీసుకెళ్లాడు. డీజిల్ పోసి తగులబెట్టి పరారయ్యాడు. 13వ తేదీన జయలక్ష్మి కుమార్తె అనీల ఫిర్యాదు మేరకు వెంకటాచలం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.అంకమ్మ ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఇందులో గిరీష్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో ఈనెల15వ తేదీన అతడిని కసుమూరు క్రాస్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మృతదేహాలను కాల్చిన ప్రాంతాన్ని పోలీసు అధికారులు పరిశీలించారు. ఓ మృతదేహం పూర్తిగా కాలిపోయి బూడిదై ఉండగా, మరొకటి సగం కాలి ఉండటంతో స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. 9 సవర్ల బంగారు ఆభరణాలను, ఆటో, హత్యకు వినియోగించిన రోకలిబండ, చాకును సీజ్ చేశారు. జంటహత్యల కేసును ఛేదించి నిందితుడ్ని అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మే 31వ తేదీలోపు ఆడిట్ చేయించాలి


మాట్లాడుతున్న డైరెక్టర్ బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అకౌంట్స్‌ను మే నెల 31వ తేదీలోపు ఆడిట్ చేయించాలని డైరెక్టర్ వీఎన్ బాబు ఆదేశించారు. ఆయన శుక్రవారం నెల్లూరులోని విద్యుత్ భవన్‌కు విచ్చేశారు. జిల్లా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ బకాయిలను వంద శాతం వసూలు చేయాలన్నారు. వినియోగదారులకు సకాలంలో బిల్లులు అందుతున్నాయా? లేదా? అని అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. 15 రోజుల్లో బిల్లులు చెల్లించేలా అప్రమత్తం చేయాలని సూచించారు. జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ మాట్లాడుతూ కేంద్రం నూతనంగా పీఎం సూర్య ఘర్ సోలార్ రూఫ్‌టాప్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా 300 యూనిట్ల వరకు సబ్సిడీపై విద్యుత్ పొందవచ్చన్నారు. ప్లే స్టోర్ నుంచి పీఎం సూర్య ఘర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యుత్ భవన్‌లోని ట్రైనింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సౌకర్యాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ విజిత పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)




పెద్దవి : రూ.75
సన్నవి : రూ.60
పండ్లు : రూ.26

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	143
లేయర్ (లైవ్) :	80
బ్రాయిలర్ చికెన్ :	252
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	280
లేయర్ చికెన్ :	136

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.



- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి
- కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది
- చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది
- నోటి దుర్వాసన ఉంటుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది
- వాంతి వచ్చినట్టుగా... వికారంగా అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

టపైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరఫు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...

ముందస్తు ప్రణాళిక ... పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.



అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం... పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వస్తారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.

అలంకరణ సామగ్రి

పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360



శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్



ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయిలను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.



సినిమా

దేవర డేట్ ఫిక్స్


● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం


● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం


● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?


● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.

మళ్లీ వస్తున్నాడు జోకర్


● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ' సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్


● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!


● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య


● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...


● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వవ్వారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...


● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు


● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్శికా జంటగా చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.